# ఘటన

"అదుగో మళ్ళీ వస్తున్నాడు మధ్యవర్తి! ఎట్టి పరిస్థితుల్లోనూ రెండు లక్షల కట్నానికి ఒక్క రూపాయి తక్కువైనా ఒప్పుకోకండి" అంది సుమతి తన భర్త, శ్యామలరావుతో.

"ఎన్నిసార్లు చెపుతావు! అలాగేలే, నువ్వు లోపలికి వెళ్ళు. బాగుండదని" తన భార్యకి చెపుతూ, "రండి! రండి అవధానిగారూ" అంటూ ఆ మధ్యవర్తిని లోపలికి సాదరంగా ఆహ్వానించాడు శ్యామలరావు.

"నమస్కారమండీ! మా స్నేహితుడు స్వయంగా వచ్చి ముఖాముఖీ మీకు చెప్పలేక నన్ను పంపించాడు. లక్షా యిరువై ఐదు వేల కంటే యివ్వలేనని, పెళ్ళి బాగా చేస్తాననిచెప్పమన్నాడు" అన్నాడు అవధాని.

"అదికాదండీ! పిల్లచూస్తే చామనచాయ! చదువు కూడా అంత ఎక్కువేం కాదు. ఏదో మంచి కుటుంబం అని మా అబ్బాయిని ఒప్పించాం. అసలు వాడితో సమానమైన ఎమ్‌టెక్ అమ్మాయిని గాని చేసుకోనన్నాడు. పెళ్ళైన తర్వాత ఎమ్.టెక్ చదివించడానికి వాడ్ని ఒప్పించి, ఈ సంబంధమే ఖాయం చేద్దామని మేం చూస్తుంటే, మీ స్నేహితుడు రెండు లక్షలు యివ్వడానికి ముందుకి రాకపోతే ఎలాగండీ! అక్కడికీ ముందడిగిన దాంట్లో ఏబై వేలు తగ్గించాం కదండీ!" అన్నాడు శ్యామలరావు.

"అయ్యా! మీ అర్హతల్ని బట్టి రెండు లక్షలూ యివ్వవచ్చు. కానీ అతనికి స్తోమత లేదు. అదే నేనయితే ఎటు నుంచి ఎటు వస్తుందోనని, నాలుగు లక్షలు మా పిల్లపేర వేసి అట్టేపెట్టాను. మొన్న బి.టెక్ సంబంధం ఒకటి వచ్చింది! తన కంటే ఎక్కువ చదువుకున్నవాడ్ని కాని చేసుకోనంది, అందుకే ఎమ్.టెక్ చదువుకున్నవాడ్ని చూస్తున్నాం" అన్నాడు అవధాని.

"అంటే ఈ నంబంధం వదిలేస్తే మీ పిల్లని, మా అబ్బాయికి ఇవ్వడానికేమైనా అభ్యంతరమా! మీ మంచితనం చూసి నేనే అడుగుతున్నాను, ఏమనుకోకండి!" అన్నాడు శ్యామలరావు.

'అయ్యో ఎంత మాట! మీరు మాత్రం మా స్నేహితుని పిల్లని మీ యింటి కోడలుగా తెచ్చుకోవడానికి ఎలాగైనా చూడండి" అన్నాడు. ఎలాగైనా ఆ లక్షా పాతికవేల

కట్నానికి వాళ్ళు ఒప్పుకోరని తెలిసిన అవధాని, లౌక్యంగా! మధ్యవర్తిగా మాట్లాడటానికి వచ్చినవాడు అసలు తన కూతురు పెళ్ళి గురించి ఎంత డబ్బు దాచాడో చెప్పడమెందుకు? పైగా ఎమ్.టెక్ పిల్లాడ్ని చూస్తున్నామని చెప్పడం!

అసలు అవధాని పూర్తిగా నమ్మిన రామశాస్త్రిని అనాలి! తన కూతురు పెళ్ళి విషయంలో, ఎంత స్నేహితుడైనా అవధానిని పంపడమే, శాస్త్రి చేసిన పొరపాటు.

"సరే! మీరు వెళ్ళండి అవధానిగారూ! నేను కబురు చేస్తాను! " అన్నాడు శ్యామలరావు.

అవధాని యింటికి వచ్చిన తర్వాత తన భార్య అడిగింది "ఏమయిందండీ! మీ శాస్త్రిగారి అమ్మాయి సంబంధం! వీళ్ళిస్తామన్న కట్నానికి శ్యామలరావుగారు ఒప్పుకున్నారా!"

"ఓసి వెర్రిమొహమా! ధరలు మండిపోతుంటే ఎమ్.టెక్ చదువుకున్నవాడు, అందులో ఏబై లక్షల ఖరీదు చేసే సొంత యిల్లు. ఒక్కడే కొడుకు! ఎక్కడైనా లక్షా పాతిక వేలకి వస్తాడటే. కుదిరేటట్లు లేదు. మన పిల్లకి కూడా సంబంధాలు చూస్తున్నామనీ, మన దగ్గర నాలుగు లక్షలు పిల్ల పెళ్ళికి ఉన్నాయని చెప్పాను. ఈ సంబంధం మన అమ్మాయికి చేద్దాం!" అన్నాడు అవధాని.

"బాగుంది వరస. మీరెంత లౌక్యులైనా ఆడపిల్ల పెళ్ళి విషయంలో, అందులోనూ మధ్యవర్తిగా వెళ్ళి ఇలా చెయ్యడం బాగాలేదు" అంది అవధాని భార్య.

"నేనేం చేశానే! వాళ్ళు రెండు లక్షలు కట్నం కావాలంటూంటే నన్నిమ్మంటావా!" అన్నాడు అవధాని.

"మీ ఫ్రెండ్ శాస్త్రిగారు, యిదే సంబంధం మన పిల్లకి కుదుర్చుకుంటే, మొహం మీద ఉమ్మేస్తారు' అంది అవధాని భార్య.

ఇంతలో శాస్త్రి వచ్చాడు "ఏమయ్యా! ఏమన్నారు ఆ శ్యామలరావుగారు! ఏదైనా నేనివ్వకల్గిన కట్నానికి ఒప్పుకున్నాడా".

"చాలా విధాల చెప్పి చూశాను శాస్త్రీ! రెండు లక్షలకి తగ్గం కాక తగ్గమన్నాడు. అదే విషయం మా ఆవిడతో చెప్పి బాధపడుతున్నాను".

"పోనీ ఏం చేస్తాం! పిల్లకి ఎక్కడ ఘటనో, ఆ దేవుడి నిర్ణయం ఎలా వుందో! నేనైతే ఎవ్వరికీ హాని చేసిన వాడ్నికాదు" అన్నాడు శాస్త్రి, దీనవదనంతో.

"పోన్లేవయ్యా! మీ అమ్మాయికి మంచి సంబంధం, అసలు కట్నం లేకుండా వస్తుందేమో!" అన్నాడు అవధాని.

"నీది మంచి మనస్సయ్యా, అవధానీ! అందుకే అటువంటి మంచి మాటలు పలికావు. అలా కట్నం లేకుండా చేసుకునే సంబంధం వస్తే, నీకూ మా అక్కయ్యకీ పట్టుబట్టలు పెడతాను" అన్నాడు శాస్త్రి.

ఇంతలో కాఫీ పట్టుకు లోపల్నుంచి వచ్చిన అవధాని భార్య "తీసుకోండి! మాకు పట్టుబట్టలు వద్దు. ఏమీ వద్దు. అన్నయ్యగారూ! మీ అమ్మాయికి మంచి సంబంధం వస్తే అదే కొండంత ఆనందం మాకు" అంది.

రెండు నెలల తర్వాత ఒకరోజు అవధాని, శాస్త్రి ఇంటికి వచ్చి మెల్లగా మొదలెట్టాడు. "మొన్న మీ అమ్మాయికి సంబంధం చూశాం! ఆ పిల్లాడి తండ్రి శ్యామలరావు గారు వచ్చి ఏమైనా మంచి సంబంధం వుంటే చెప్పండి అవధానిగారూ! అన్నాడు. కాఫీ పట్టుకొచ్చిన మా అమ్మాయిని చూసి పిల్లనక్షత్రం, చ[illegible]వూ అన్నీ అడిగాడయ్యా! పిల్ల తరహా అంతా ఆయనికి నచ్చినట్లుంది. ఒకవేళ ఆయనంతట ఆయనే ముందుకి వస్తే, ఏం చెయ్యాలా అని ఆలోచిస్తున్నాను. నీ సలహా ఏమిటో తెలుసుకుందామని వచ్చాను మీ యింటికి.

"నా సలహా ఏం వుంది అవధానీ! అది చాలా మంచి సంబంధం. నాకు ఆర్థిక స్తోమత లేక వదులుకున్నాను. ఒకవేళ వాళ్ళే అడిగారనుకో, కాళ్ళదగ్గరకొచ్చిన సంబంధం, కాశీ వెళ్ళినా దొరకదు అంటారు. సంతోషంగా ముందుకు వెళ్ళు!" అన్నాడు శాస్త్రి.

"ఏమిటో శాస్త్రీ! మనం ఎప్పట్నుంచో స్నేహితులం! మీ అమ్మాయికి కుదరని సంబంధం నేనెందుకు ఒప్పుకోవాలి అని చూస్తున్నాను" అన్నాడు అవధాని.

"అదేం ఫర్వాలేదయ్యా!" అన్నాడు శాస్త్రి. అవధాని వెళ్ళిన తర్వాత లోపల్నుంచి వచ్చిన శాస్త్రి భార్య "ఈ అవధానిగారు నిజంగా బాధపడుతున్నాడంటారా లేక మొసలి కన్నీరా! ఈయన బహులౌక్యుడండోయ్" అంది.

"పోన్లేవే మనకెందుకు! వాళ్ళ పిల్లకి కుదిరితే మంచిదే కదా!" అన్నాడు శాస్త్రి.

అవధాని శ్యామలరావు వియ్యంకులయ్యారు. ఒక ఏడాది తర్వాత అవధాని వాక్సుద్ధి ఫలించింది. శాస్త్రి కూతుర్ని అమెరికాలో పనిచేసే ఒక కంప్యూటర్ ఇంజనీర్

కట్నం లేకుండా చేసుకున్నాడు. లాంఛనాలు కూడా వద్దన్నారు, ఆ పిల్లాడి తల్లిదండ్రులు! వాళ్ళకి మంచి కుటుంబమే ముఖ్యమన్నారు.

శాస్త్రి కట్నం ఇవ్వక్కర్లేదని ఉత్సహంలో పెళ్ళి చాలా ఘనంగా చేశారు. ''ఏదో యధాలాపంగా అంటే కట్నం లేని సంబంధమే వచ్చిందేమిటి!'' అని అవధాని ఆశ్చర్యపోయాడు.

ఇంటికి వెళ్ళిన తర్వాత తన భార్యతో ''నాకెంత వాక్శుద్ధి వుందో చూశావా!'' అన్నాడు. పైగా ''ఇంకొకళ్ళ విషయంలో కూడా ఈ వాక్శుద్ధి పరీక్షించుకుంటానని, ఈసారి ఎవరికైనా 'బాగా ఎక్కువ కట్నం తీసుకునే సంబంధం వస్తుంది' అంటాననీ, ఏం జరుగుతోందో చూస్తా అన్నాడు.

అవధాని భార్య ''అసలు మీకు వాక్శుద్ధికి, అనౌచిత్యతకి తేడా తెలీదండి''

''ఏం! ఎందుకు''

''ఎందుకా! ఎక్కువ కట్నం తీసుకునే సంబంధం వస్తుంది అనడం అనౌచిత్యం'' అంది అవధాని భార్య.

ఆతృతతో శ్యామలరావు కొడుక్కి తన కూతుర్ని యిచ్చినందుకు చాలా బాధపడ్డాడు అవధాని. శ్యామలరావు కొడుక్కి చాలా దురలవాట్లు వున్నాయట. రోజూ తాగేసి పెళ్ళాన్ని కొడుతున్నాడట.

పాపం! అవధాని భార్య రోజూ ఏడుపే యింట్లో! ''ఏదో పెద్ద సంబంధమనీ, శాస్త్రిగారికి దక్కకుండా మనకే దక్కుతోందనీ, బోల్డు లౌక్యం ప్రదర్శించి, పిల్ల గొంతు కోశారు. ఆఖరికి నిత్యం ఏడవ్వలసి వస్తోంది'' అని బాధపడింది, అవధాని భార్య. మంచి మనస్సుగల శాస్త్రికి కట్నం లేని సంబంధం వచ్చింది. చెడు అలవాట్లు లేని పిల్లాడు దొరికాడు! దేవుడికి తెలుసు, ఎవరికి ఏమివ్వాలో.

(ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 25-5,2006)